సాక్షి ప్రకాశం

శనివారం। 26। ఆగస్టు। 2023



సంక్షేమమే ధ్యేయంగా ధర్మపాలన

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధర్మంగా పరిపాలన చేస్తున్నారని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. - 8లో..



భోజనం @ రూ.20

ఒంగోలు నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
37/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

టీటీడీ పాలకమండలి సభ్యునిగా శిద్దా సుధీర్



శిద్దా సుధీర్‌కుమార్

ఒంగోలు: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సభ్యునిగా వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుమారుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త శిద్దా వీరవెంకట సుధీర్‌కుమార్ నియమితులయ్యారు. ఒంగోలుకు చెందిన శిద్దా సుధీర్ 1981 జూన్ 10వ తేదీ జన్మించారు. మద్రాస్ యూనివర్శిటీ నుంచి మేనేజ్‌మెంట్‌లో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. తమ వ్యాపారాల్లో ప్రధానమైన గ్రానైట్ పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించి గ్రానైట్ ఎగుమతి వ్యాపారాన్ని విస్తృతం చేశారు. కస్టమర్ ఎక్సలెన్సీ రంగంలోనూ మంచి పట్టు సాధించారు. కరోనా సమయంలో క్వార్ట్జ్ రాళ్ల ఎగుమతికి సంబంధించి తీవ్ర సంక్షోభం ఏర్పడిన నేపథ్యంలో సాహసోపేతంగా క్వార్ట్జ్ రాళ్ల వెలికితీతలో స్టేట్ ఆఫ్ ద ఆర్ట్ టెక్నాలజీ సౌకర్యాల ఏర్పాటు, సిబ్బందికి శిక్షణ ఇప్పించారు. తమ సంస్థ అయిన జ్యోతి గ్రానైట్ అధినేతగా వ్యవహరిస్తూ అత్యంత విజయవంతంగా నడిపించారు. రాజకీయాల్లోనూ తండ్రికి తగిన తనయునిగా రాణిస్తున్నారు. వైఎస్సార్ సీపీలో యువనాయకునిగానే కాకుండా ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంతో పాటు ఆర్థికసాయం అందించడంలోనూ పెద్ద మనసుతో వ్యవహరిస్తున్నారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా విశేష సేవలందిస్తూ చిన్నారుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంచాలనే ఉద్దేశంతో ఏకంగా లార్డ్ కృష్ణ షటిల్ అకాడమీని ప్రారంభించారు. దాని ద్వారా అనేకమంది షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను తయారు చేసి జాతీయ స్థాయి పోటీలకు సైతం పంపించారు. ప్రస్తుతం టీటీడీ పాలకమండలి సభ్యునిగా సుధీర్‌కుమార్ ఎన్నికవడంతో శిద్దా అభిమానులు ఒంగోలులోని వారి నివాసం వద్ద బాణసంచా పేల్చి ఆనందం వ్యక్తం చేశారు.

పిస్టల్ షూటింగ్‌లో జిల్లావాసికి బంగారు పతకాలు



బంగారు పతకాలతో ప్రణవి

కొత్తపట్నం: పిస్టల్ షూటింగ్‌లో జిల్లావాసి రెండు బంగారు పతకాలు సాధించింది. కొత్తపట్నం మండలం రంగాయపాలెం పంచాయతీ వలసపాలేనికి చెందిన ద్వారం ప్రణవి ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో నిర్వహించిన 14వ సౌత్‌జోన్ 25 మీటర్ స్పోర్ట్స్ పిస్టల్ షూటింగ్ విభాగంలో పోటీపడింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులతో తలపడి ఉమెన్స్ సీనియర్స్, జూనియర్స్ విభాగాలలో విన్నర్‌గా నిలిచింది. రెండు విభాగాలలో రెండు బంగారు పతకాలు సాధించింది. మూడు సంవత్సరాల నుంచి బెంగళూరుకు చెందిన కోచ్ మంజునాథ్ వద్ద ప్రణవి శిక్షణ తీసుకుంది. గతంలో కూడా అనేక పోటీల్లో ప్రణవి బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు తల్లి ద్వారం ప్రగతి తెలిపారు. జాలిరెడ్డి, వెంకటేశ్వర్లు, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

వరలక్ష్మీ పాహిమాం



పూజలందుకుంటున్న వరలక్ష్మీదేవి



ఒంగోలు సంతపేట సాయిబాబా దేవస్థానంలో నాగలక్ష్మి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



పామూరులోని వాసవీమాత ఆలయంలో...



త్రిపురాంతకంలో ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపురసుందరీదేవి మూలవిరాట్

వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లలోనూ వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. ఆనందం, సంపద, శ్రేయస్సు వంటి వరాలను ప్రసాదించాలని లక్ష్మీదేవిని ప్రార్థించారు.

ప్రగతి బాట

ప్రయాణికుల అభిరుచులకు తగ్గట్టుగా బస్సుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ కొత్త బస్సులు అందుబాటులోకి తెచ్చి లాభాల బాటలో పయనిస్తోంది ఆర్టీసీ. ప్రైవేటు వాహనాల పోటీని తట్టుకుంటూ మారుమూల ప్రాంతాలకు సైతం ప్రయాణికులను చేరవేస్తోంది. జిల్లాలో 507 బస్సు సర్వీసులు రోజుకు 1.97 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయి. గత పాలకుల పుణ్యమా అని నష్టాల పాలైన ఆర్టీసీ.. అప్పులను తీరుస్తూ ప్రగతి బాట పట్టింది. సిబ్బంది సైతం అంకితభావంతో పనిచేస్తూ సంస్థ పురోగతికి కృషి చేస్తున్నారు.



- నష్టాలను అధిగమిస్తూ లాభాల బాటలోకి ఆర్టీసీ
- గాడిన పడుతున్న ప్రయాణం
- ఐదు డిపోల్లో 507 బస్సులు
- ప్రతిరోజూ 1.23 లక్షల మంది ప్రయాణికులు
- 1.97 లక్షల కిలోమీటర్ల ప్రయాణం

మార్కాపురం:

ఆర్టీసీలో నూతన శకం ప్రారంభమైంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ నిర్వీర్యమైపోయింది. పగిలిపోయిన అద్దాలు, చినిగిపోయిన సీట్లు, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు అవస్థపడేవారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని 2020 జనవరిలో ప్రభుత్వంలో విలీనం చేశారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంటుగా మారిన తర్వాత ఆర్టీసీ రూపురేఖలు కూడా మారిపోయాయి. ప్రస్తుతం ప్రయాణికులు లగ్జరీగా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే నష్టాలను అధిగమిస్తూ లాభాల బాటలో ప్రయాణిస్తోంది ఆర్టీసీ. సిబ్బందికి బకాయిల చెల్లింపు, పెరుగుతున్న డీజిల్ ధరలు ఆర్టీసీకి భారంగా మారినప్పటికీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో సిబ్బంది చూపిస్తున్న చొరవతో నష్టాలు తగ్గుముఖం పడుతున్నాయి. మరోవైపు ప్రైవేటు బస్సులు, వాహనాల పోటీని తట్టుకుంటూ మారుమూల పల్లెలకు సైతం సర్వీసులు నడుపుతోంది. జిల్లాలో కనిగిరి, మార్కాపురం డిపోలు ఇప్పుడిప్పుడే నష్టాల నుంచి బయటపడుతున్నాయి. మెరుగైన సేవలే లక్ష్యంగా సిబ్బంది పనిచేస్తుండటంతో ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

జిల్లాలో సర్వీసులిలా...

ప్రస్తుతం జిల్లాలో మార్కాపురం, గిద్దలూరు, పొదిలి, కనిగిరి, ఒంగోలు డిపోలు ఉన్నాయి. వీటిలో మొత్తం 507 సర్వీసులున్నాయి. ఇంద్ర 14, సూపర్ లగ్జరీ 80, ఎక్స్‌ప్రెస్ 103, పల్లెవెలుగు 272, అల్ట్రా డీలక్స్ 41 సర్వీసులతో పాటు స్టార్‌లైన్, వెన్నెల, అమరావతి, గరుడ సర్వీసులు ప్రయాణికులకు సేవలందిస్తున్నాయి.

ప్రతిరోజూ 1.97 లక్షల కిలోమీటర్ల ప్రయాణం...

జిల్లాలో ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ 1.97 లక్షల కిలోమీటర్లు తిరుగుతున్నాయి. పొదిలి డిపో పరిధిలో 25 వేల కిలోమీటర్లు, ఒంగోలు డిపో పరిధిలో 55,500 కిలోమీటర్లు, మార్కాపురం డిపో పరిధిలో 38 వేలు, కనిగిరి డిపో పరిధిలో 46 వేలు, గిద్దలూరు డిపో పరిధిలో 33 వేల కిలోమీటర్ల దూరం బస్సులు తిరుగుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు ప్రయాణికులను తీసుకెళ్తున్నాయి.

డిపోల వారీగా బస్సుల వివరాలు...

డిపో	పల్లె వెలుగు	ఇంద్ర	వెన్నెల	గరుడ	ఎక్స్‌ప్రెస్	అల్ట్రా	సూపర్ లగ్జరీ
మార్కాపురం	49	2	–	–	26	4	21
గిద్దలూరు	48	–	–	–	15	8	8
పొదిలి	51	2	–	–	4	–	17
కనిగిరి	38	2	–	స్టార్‌లైన్-1	23	27	20
ఒంగోలు	82	8	2	6	8	6	22
ఒంగోలు	స్టార్‌లైన్-2	అమరావతి-4					



మార్కాపురం బస్టాండ్‌లోని బస్సులు

లాభాల వైపు ప్రయాణం...

జిల్లాలో మొత్తం 5 డిపోలు ఉండగా, కనిగిరి, మార్కాపురం డిపోలు ఇప్పుడిప్పుడే నష్టాల్లో నుంచి బయటపడుతున్నాయి. కనిగిరి డిపో పరిధిలో ఈ ఏడాది జూన్‌లో 109 సర్వీసులు నడిపి 14.30 లక్షల కిలోమీటర్లు తిప్పి రూ.7.55 కోట్ల ఆదాయం పొందగా, రూ.6.94 కోట్లు ఖర్చయింది. అంటే రూ.61 లక్షల ఆదాయం వచ్చింది. జూలైలో 109 సర్వీసులు తిప్పి 14.06 లక్షల కిలోమీటర్లు నడిపి రూ.7.02 కోట్ల ఆదాయం పొందగా, రూ.6.64 కోట్లు ఖర్చయి రూ.38 లక్షల ఆదాయం వచ్చింది.

ఈ ఏడాది తగ్గిన నష్టాలు...

గతేడాది మే నెలలో మార్కాపురం డిపోలో 102 సర్వీసులు నడపడం ద్వారా రూ.4.54 కోట్ల ఆదాయం రాగా, రూ.6.13 కోట్లు ఖర్చయింది. దీంతో రూ.1.59 కోట్లు నష్టం వచ్చింది. కానీ, ఈ ఏడాది మే నెలలో రూ.5.60 కోట్లు ఆదాయం రాగా, రూ.6.22 కోట్లు ఖర్చయింది. కేవలం రూ.62 లక్షలు మాత్రమే నష్టం వచ్చింది. గతేడాది మే ఆదాయంతో పోల్చుకుంటే ఈ ఏడాది మేలో నష్టాలు తగ్గుముఖం పట్టాయి. అలాగే జూన్ నెలలో కూడా ఆదాయం, వ్యయాలుపోను రూ.9.41 లక్షల నష్టం వచ్చింది. అందులో సిబ్బందికి పాతబకాయిలు చెల్లించడంతో ఖర్చు పెరిగినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. పొదిలి, గిద్దలూరు డిపోల్లో కూడా నష్టాలు తగ్గుముఖం పట్టాయి.



ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్

ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తున్నాం



బస్సులను మంచి కండీషన్లతో తిప్పుతున్నాం. అన్ని బస్సులు బాగున్నాయి. కొత్త అద్దాలు, సీట్లు బిగించాం. ప్రయాణికులకు మంచి సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఆర్డినరీ బస్సుల్లో కూడా ఈ పాస్ మిషన్లు ఇవ్వడం ద్వారా చిల్లర సమస్య లేదు. ఫోన్ పే చేసుకోవచ్చు. జీపీఆర్ఎస్ సిస్టం పెట్టడం వలన బస్సు ఎక్కడ ఉందో ట్రాకింగ్ చేసుకుంటున్నాం. ప్రజలు ఆర్టీసీల్లోనే ప్రయాణించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి.

– ఏఎస్ నరసింహులు, డిపో మేనేజర్, మార్కాపురం

సంస్థ అభివృద్ధికి సహకారం



మార్కాపురం ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్, ఇతర సిబ్బంది అంతా నష్టాలు తగ్గించి లాభాల్లోకి వెళ్లేందుకు కృషి చేస్తున్నారు. డిపోల్లో నుంచి బస్సును సమయానికి బయటకు తీసి స్టాండులో పెడుతున్నారు. చిల్లర సమస్య లేకుండా ఈ పాస్ మిషన్ అందుబాటులోకి వచ్చింది. ప్రజలు ప్రైవేటు వాహనాల్లో వెళ్లకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరుతున్నాం.

– ఎస్ఎస్ శాస్త్రి, ఎంప్లాయిస్ యూనియన్

కష్టపడి పనిచేస్తున్నాం



ఆర్టీసీ అభివృద్ధి చెందేందుకు, నష్టాలు అధిగమించి లాభాల్లోకి వచ్చేందుకు సిబ్బంది కష్టపడి పనిచేస్తున్నారు. ప్రయాణికులతో చక్కగా వ్యవహరిస్తున్నారు. బస్సుల్లో కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణికుల క్షేమంపై దృష్టి పెట్టాం.

– కాశయ్య, ఎన్ఎంయూ ప్రెసిడెంట్

అన్ని వర్గాల అభ్యున్నతే సీఎం లక్ష్యం

- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి స్వచ్ఛభారత్ కో ఆర్డినేటర్ల క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ మీనావెంకట్రావు, ఉద్యోగులు

ఒంగోలు అర్బన్: అన్ని వర్గాల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో తొలగించబడిన స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్లకు తిరిగి ఉద్యోగాలు కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై వారంతా హర్షం వ్యక్తం చేస్తూ ఒంగోలులోని చర్చి సెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద సీఎం చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా స్వచ్ఛ సర్వేక్ష గ్రామీణ సంస్థలో స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్లు పనిచేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. వారిని గత ప్రభుత్వంలో తొలగించగా, గత ఎన్నికలకు ముందుగా జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన పాదయాత్రలో తిరిగి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుతం ఉద్యోగాలు కల్పించారన్నారు. మాట ఇస్తే తప్పే అలవాటు, మడమ తిప్పే అలవాటు జగన్‌కు లేదన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీజీఈఎస్ఏ) చైర్మన్ ఎండ్లూరి చిట్టిబాబు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి, నగర మేయర్ గంగాడ సుజాత, నాయకులు కటారి శంకర్, ఉద్యోగాలు పొందిన మండల కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉందాం : ఏపీజీఈఎస్ఏ చైర్మన్ చిట్టిబాబు

గత ప్రభుత్వంలో తొలగించిన స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తిరిగి ఉద్యోగాలు కల్పించడం గొప్ప విషయమని ఏపీజీఈఎస్ఏ చైర్మన్ ఎండ్లూరి చిట్టిబాబు అన్నారు. స్థానిక ప్రకాశం భవనం ఎదురుగా గల ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో శుక్రవారం స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అందరం అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల పట్ల సీఎం అంకితభావంతో ఉన్నారని, అన్నివర్గాలకు న్యాయం చేస్తారని చెప్పారు. రాబోయే రోజుల్లోనూ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సచివాలయాల ఉద్యోగుల సంఘ నాయకులు కొలకలూరి ప్రభాకర్, ఏసోబు, కె.కోటేశ్వరరావు, ఎస్.శాస్త్రి, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజీఈఎస్ఏ చైర్మన్ చిట్టిబాబు

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- త్రిపురాంతకం మండలం మిరియంపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలికి ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. త్రిపురాంతకం మండలం మిరియంపల్లిలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి మేలు చేయాలని, అభివృద్ధి బాటలో నడిపించాలని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తుంటే విమర్శిస్తున్న ప్రతిపక్షాలు గతంలో జన్మభూమి కమిటీల పేరుతో రాజకీయాలు చేశాయని గుర్తుచేశారు. పేదల సంక్షేమాన్ని గాలికొదిలిన ఘనత వారికి దక్కుతుందని విమర్శించారు. నేడు అర్హులైన వారందరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. వారి హయాంలో సంక్షేమాన్ని విస్మరించిన ప్రతిపక్షం.. ప్రస్తుతం తిరిగి ప్రస్తుత పథకాలను కొనసాగిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించిన పథకాల ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమవుతుందని తెలిపారు. వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి మరీ ప్రజలకు సేవలందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని అన్నారు. వలంటీర్లు అందుబాటులో లేకుంటే చర్యలు తప్పవని మంత్రి సురేష్ హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని సూచించారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భ్రమరాంబ, ఏఓ వరప్రసాద్, ఎంఈఓ-2 టి.రాజశేఖరరెడ్డి, ఏపీఎం ఎడ్వర్డ్, ఏఈలు హనుమాన్‌బాబు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, గ్రామసర్పంచ్ సుధాకర్, ఎంపీటీసీ సుబ్బారావు, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రవయ్య, శ్రీనివాసరావు, నక్కా చిన్నత్రిపురారెడ్డి, రంగబాబు, కోట సుబ్బారెడ్డి, లింగయ్య, సత్యనారాయణరెడ్డి, శ్యామ్, నాసర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

రేపు యూటీఎఫ్ రాష్ట్ర మహాసభ

ఒంగోలు: యూటీఎఫ్ రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ మహాసభను ఈ నెల 27వ తేదీ ఉదయం స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓవీ వీరారెడ్డి, ఎస్.రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు స్థానిక డీఆర్ఆర్ఎం హైస్కూల్లో బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. 28వ తేదీ వరకూ రెండు రోజులపాటు సభలు జరుగుతాయని చెప్పారు. ముఖ్యఅతిథులుగా ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల శాసన మండలి సభ్యులు ఐ.వెంకటేశ్వరరావు, కేఎస్ లక్ష్మణ్‌రావు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వరరావు, కేఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు హాజరవుతారన్నారు. ఉపాధ్యాయులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ సేవలపై ఆరా



చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడుతున్న యాదాల అశోక్‌బాబు

ఒంగోలు అర్బన్: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై నగరంలోని పలు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ స్పెషలాఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు ఆరా తీశారు. అశోక్‌బాబు శుక్రవారం నగరంలోని వసుద కళ్యాణ్, కమల నర్సింగ్‌హోమ్‌లలో ఆరోగ్యశ్రీ సేవలు పొందుతున్న రోగులతో వైద్య సేవలు అందుతున్న తీరుపై మాట్లాడారు. ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి ఇంటికి వెళ్లి విశ్రాంతి సమయంలో కూడా వైఎస్సార్ ఆసరా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అదుకుంటుందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య సేవలు రోగులకు అందించాలని ఆసుపత్రి డాక్టర్లకు సూచించారు.

విద్యుదాఘాతానికి విద్యార్థి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీరాం

సింగరాయకొండ: విద్యుత్ షాక్ తగిలి విద్యార్థి పాలకీర్తి కార్తీక్(11) మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి కనుమళ్ల పంచాయతీ పెద్ద కనుమళ్ల ఎస్టీకాలనీ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..పాలకీర్తి కార్తీక్ తండ్రి బ్రహ్మయ్య బాతుల హేచరీ నిర్వహిస్తున్నాడు. కార్తీక్ 3వ తరగతి చదువుతున్నాడు. తండ్రి బ్రహ్మయ్య, తల్లి జ్యోతి బాతులను మేపుకుంటూ దూరప్రాంతాలకు వెళ్తుండగా కార్తీక్ నాయనమ్మ వద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి హేచరీ వద్ద ఉన్న సాకెట్‌లో ఫ్యాన్ వైరును పెట్టే క్రమంలో కార్తీక్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. బ్రహ్మయ్యకు ఇద్దరు కుమారులు ఉండగా కార్తీక్ చిన్నవాడు. కార్తీక్ ఎంపీపీ కట్టా శోభారాణి మేనల్లుడు. ఇతని మరణవార్త విని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు శుక్రవారం కార్తీక్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరాం పేర్కొన్నారు.

ఉరేసుకొని వాచ్‌మన్ ఆత్మహత్య



శ్రీను మృతదేహం

చీమకుర్తి: మర్రిచెట్లపాలెంలోని ఒక గ్రానైట్ ఫ్యాక్టరీలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న నలగంతుల శ్రీను(30) గురువారం రాత్రి చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం మృతుడి సోదరుడు వచ్చి చూసిన తర్వాత విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శ్రీను స్వస్థలం నల్గొండ జిల్లా త్రిపురాం మండలం జి.అన్నవరం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. బంధువుల గ్రామంలో ఫంక్షన్ ఉండటంతో భార్యని స్వగ్రామానికి పంపించాడు. అనంతరం రాత్రి ఉరేసుకొని చనిపోతున్నట్లు సోదరుడికి వీడియో కాల్ చేసి పెట్టేశాడు. కంగారు పడిన అతను మళ్లీ తిరిగి ఫోన్ చేయగా స్విచ్చాప్ వచ్చింది. దీంతో ఆందోళనతో శుక్రవారం వచ్చి చూడగా ఉరేసుకొని మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. భార్యభర్తల మధ్య వివాదమే శ్రీను ఆత్మహత్యకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. భార్య శివరాణి ఫిర్యాదు మేరకు ఎస్సై రామిరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన పొగాకు వేలం



పొగాకును పరిశీలిస్తున్న బోర్డు ఆర్‌ఎం లక్ష్మణ రావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు పొగాకు బోర్డు పరిధిలోని వేలం కేంద్రాల్లో శుక్రవారం పొగాకు వేలం ముగిసినట్లు పొగాకు బోర్డు ఆర్ ఎం ఎం.లక్ష్మణరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దక్షిణ ప్రాంత నల్లరేగడి నేలలు(ఎస్‌బీఎస్), దక్షిణ ప్రాంత తేలిక పాటి నేలలు(ఎస్ఎల్ఎస్) ప్రాంతాల్లో పొగాకు కొనుగోళ్లు ముగిసినట్లు వెల్లడించారు. వేలం ప్రక్రియ ముగిసిందని మొత్తం 123.11 మిలియన్ కిలోల పొగాకు అమ్మకాలు జరిగాయన్నారు. ఈ ఏడాది సరాసరి సగటు ధర కిలో రూ.216.28 రైతులకు దక్కిందన్నారు. అత్యధికంగా కేజీ రూ.289, అత్యల్పంగా రూ.150 వచ్చినట్లు తెలిపారు. అధికారికంగా పొగాకు ఉత్పత్తి పరిమాణం 87.94 మిలియన్ కిలోలు మాత్రమేనన్నారు. రైతులు రానున్న సంవత్సరం పొగాకు బోర్డు ఇచ్చిన కోటా మేరకు మాత్రమే పండించాలని సూచించారు. కొత్తగా బ్యారన్లను కట్టవద్దన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపి పండించుకోవాలన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా ధర్మపాలన

- అంబేడ్కర్ కలలను సాకారం చేస్తున్న సీఎం జగన్
- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



ఐక్యసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

పామూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలను సాకారం చేస్తున్న ఏకైక సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే, ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక అనిల్‌గార్డెన్స్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ దళిత రైతు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమసంఘాల ఐక్యసభ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటగాని పేతురు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంకోసం 28 రకాల సంక్షేమ పథకాలను అమలుచేస్తూ రూ.2 లక్షల కోట్ల సాయాన్ని వారి ఖాతాల్లో జమచేసి అండగా నిలిచిందన్నారు. ఈ నాలుగేళ్లలో పార్టీలకతీతంగా రాష్ట్రంలో ధర్మపాలన సాగించారని కొనియాడారు. పూలే ఆశయసాధనలో భాగంగా విద్యే ఆస్తి అని నమ్మి విద్యారంగానికి అధికా ప్రాధాన్యం ఇచ్చి బడ్జెట్‌లో 10 శాతానికి పైగా నిధులు కేటాయించడంతో పాటు నాడు– నేడుతో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలను తలదన్నేలా తీర్చిదిద్దారని కొనియాడారు. విజయవాడలో రూ.400 కోట్లతో 125 అడుగుల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం రూపుదిద్దుకుంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకోసం అసైన్‌మెంట్‌భూములపై వారికి పూర్తి హక్కులు ఇచ్చి రిజిస్ట్రేషన్ ద్వారా అమ్ముకునే హక్కు కల్పించడం, భూమిలేని నిరుపేదలకు అసైన్‌మెంట్ కమిటీలద్వారా వ్యక్తికి 2 ఎకరాల పంపిణీకి ప్రభుత్వం సిద్ధం చేస్తుందన్నారు. 2014లో ఓడినా బీసీనైన తనకు సీఎం అండగా నిలిచి 2019లో ఎమ్మెల్యేగా అందరిసాయంతో 42 వేల మెజారిటీతో గెలిపించారన్నారు. వచ్చే ఎన్నికల్లో కనిగిరిలో మరోసారి విజయఢంకా మోగిస్తామన్నారు.

ఐక్యతతో ముందుకు సాగాలి..

అభివృద్ధికోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం, సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజ్యాధికారంలో, నామినేటెడ్ పోస్టుల్లో కీలకమైన పదవుల్లో ఉన్నారని ఇది ఎంతో గర్వకారణమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా అమలుచేసేందుకు సన్నద్ధమవుతున్నాయన్నారు. కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 4 శాతం రిజర్వేషన్లతో మైనారిటీలకు అండగా నిలిచారన్నారు. సిరాజ్ రహ్మాన్ మాట్లాడుతూ అన్ని కులాలు, మతాలు సమానమని మతస్వేచ్ఛ, వాక్‌స్వాతంత్ర్యం, రిజర్వేషన్లు కల్పించి అంబేడ్కర్ అందరిబాటని ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఈసందర్భంగా మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కే.ఇక్బాల్ అహ్మద్‌ఖాన్‌ను ఎమ్మెల్యే బుర్రా ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీ ఏసురత్నం, కో ఆప్షన్ నాయబ్‌రసూల్, షేక్.సెంట్రింగ్‌చాంద్‌బాషా, చల్లా సుబ్బారావు, కె.బసవరాజు, గుంటెయ్య యాదవ్, గంగరాజుయాదవ్, ఓగూరి ఏడుకొండలు, చల్లా శివయ్య, మౌలానా షరీఫ్, డోలా శేషు, పోతల రమేష్, పాలేటి ప్రేమ్, కె.నాయబ్ రసూల్ పలువురు పాల్గొన్నారు.

భోజనం@ రూ.20

- ఆహా క్యాంటీన్‌ను ప్రారంభించిన బాలినేని
- మెప్మా ఆధ్వర్యంలో చౌకగా భోజనంతో పాటు ఇతర ఆహార పదార్థాలు



వంటకాలను రుచి చూస్తున్న ఎమ్మెల్యే బాలినేని



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని, మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ మీనా వెంకట్రావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఆహా క్యాంటీన్‌ను మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ప్రారంభించిన ఆయన పలు పదార్థాల రుచి చూశారు. తక్కువ ధరకు అందిస్తున్న క్యాంటీన్ నిర్వహిస్తున్న వారిని అభినందించారు. రూ.20 కే భోజనం అందించటం మంచి పరిణామమన్నారు. పేదలకు, కార్మికులకు, కూలీలకు ఈ ఆహా క్యాంటీన్ ఎంతో ప్రయోజనకరమన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. మేయర్ గంగాడ సుజాత, మెప్మా పీడీ తేళ్ల రవి కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు లేకుండా చేస్తాం

- ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ



విద్యుత్ సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహిస్తున్న ఎస్ఈ సత్యనారాయణ

సింగరాయకొండ: రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందుకోసం ధర ఎంతైనా విద్యుత్ కొనుగోలుకు కృషి చేస్తున్నామని విద్యుత్ ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ అన్నారు. స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో శుక్రవారం సింగరాయకొండ సబ్ డివిజన్ స్థాయి విద్యుత్ ఉద్యోగుల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఈ సత్యన్నారాయణ మాట్లాడుతూ ఇటీవల విద్యుత్ సరఫరాలో అంతరాయాల వలన ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ఉత్పత్తి కావటం లేదని ఒకవేళ కొందామన్నా కూడా విద్యుత్ అందుబాటులో లేదన్నారు. దీంతో ప్రభుత్వం రాష్ట్రంలో విద్యుత్ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించిందని తెలిపారు. రాబోయే సంవత్సర కాలంలో విద్యుత్ వినియోగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో వ్యవసాయానికి ప్రత్యేక ఫీడర్, పరిశ్రమలు, టెక్నాలజీ, కమర్షియల్, గృహ అవసరాలకు కలిపి మరో ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం గ్రామస్థాయిలో సింగిల్ ఫేజ్ మాత్రమే ఇస్తున్నామని ఈ విధానం వలన వలన గ్రామ స్థాయిలో కూడా త్రీఫేజ్‌లో విద్యుత్ సరఫరా అందిస్తామని అప్పుడు పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా ప్రతి గ్రామంలో పరిశ్రమలు, మినీ కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటుకు అవకాశం ఏర్పడటంతో వ్యవసాయానికి మరింత సహకారం లభిస్తుందని వివరించారు. ప్రస్తుతం ఈ విధానం గుజరాత్ రాష్ట్రంలో అమల్లో ఉందని ఆ రాష్ట్రాన్ని స్ఫూర్తిగా తీసుకున్నామన్నారు. అంతేకాక రాబోయే రోజుల్లో వ్యవసాయానికి తప్ప మిగిలిన అన్ని రంగాల్లో ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రీ పెయిడ్‌మీటర్లు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటి వలన ఇక ప్రతినెలా కరెంటు మీటరు రీడింగ్ తీసే అవసరం ఉండదని సెల్ ఫోన్‌కు రీచార్జ్ చేసుకున్నట్లు కరెంటు మీటర్లకు రీచార్జ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం సబ్ డివిజన్ స్థాయిలో సిబ్బందిని సమావేశపరచి వారి పనితీరును సమీక్షిస్తున్నామని రాబోయే రోజుల్లో సిబ్బంది పనితీరును బట్టి వారిని కొనసాగించాలా లేదా అని నిర్ణయించడం జరుగుతుందన్నారు. విద్యుత్ బకాయిలు లేకుండా చూడాలని నూరు శాతం లక్ష్యాలను సాధించాలని సూచించారు. డివిజన్ స్థాయిలో సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉన్న మండలాల్లో సింగరాయకొండ మొదటి స్థానంలో, కొండపి ద్వితీయ స్థానంలో ఉన్నాయన్నారు. సింగరాయకొండలో నలుగురు సిబ్బంది పనితీరు బాగా లేదని వెంటనే వారిని విధుల నుంచి రిలీవ్ చేయాలని ఆదేశించామన్నారు. విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉండాలని వారు ఫోన్ చేసినప్పుడు సిబ్బంది వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా సింగరాయకొండ, ఉలవపాడు సిబ్బందిపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయని, సిబ్బంది పనితీరు మార్చుకుని వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. కందుకూరు డీఈ వీరయ్య, ఏడీఈ పి. యుగంధర్, ఏఈలు సాంబశివరావు, హర్దీష్, కోటయ్య, నాలుగు మండలాల విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించాలి



సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు, పాల్గొన్న అధికారులు

- గ్రానైట్ వాహనాల్లో ఓవర్‌లోడ్ తగ్గించాలి
- జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించాలని, గ్రానైట్ వాహనాల్లో ఓవర్‌లోడ్ తగ్గించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవనంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చీమకుర్తి నుంచి రామాయపట్నం పోర్టుకు వెళ్లే గ్రానైట్ వాహనాల్లో ఓవర్ లోడును తగ్గించాలని సూచించారు. ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ వద్ద కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని, నగరానికి బయట ఉన్న ప్రదేశాల్లో కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులు నిలిపేందుకు స్థలాన్ని పరిశీలించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా రోడ్ల వెంట తగిన ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్, పోలీసు, ఆర్ అండ్‌బీ, వైద్యారోగ్య శాఖ, ఇతర సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణ, భద్రతా నియమాలపై రూపొందించిన పోస్టర్లను ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు ఆవిష్కరించారు. సమావేశంలో ఉప రవాణా కమిషనర్ సుశీల, ఏఎస్పీ నాగేశ్వరరావు, ట్రాఫిక్ డీఎస్పీ, ఆర్టీసీ ఆర్‌ఎం, ఆర్‌అండ్‌బీ ఈఈ, నేషనల్ హైవేస్ అధికారులు, జీజీహెచ్ సూపరింటెండెంట్, పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు

- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 9 మందికి జైలుశిక్ష
- వాహనదారులు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలి
- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సిటీ: డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదకరమని, పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ మలికగర్గ్ అన్నారు. ఎస్పీ మలికగర్గ్ ఆదేశాల శుక్రవారం మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో బ్రీతింగ్ ఎనలైజర్‌తో పరీక్షలు చేసి డ్రంకన్ డ్రైవింగ్ కేసులు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ పరిధిలో డ్రంకన్ డ్రైవింగ్ తనిఖీల్లో పట్టుబడ్డ 9 మందిని ఒంగోలు ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచగా జడ్జి వెంకటేశ్వర శర్మ ఒక్కొక్కరికీ ఏడు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపటం వల్ల గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం లాంటివి జరిగి మీ మీద ఆధారపడే కుటుంబ సభ్యులు రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. వాహనాలు నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ డ్రంకన్ అండ్ డ్రైవింగ్‌లో పట్టుబడితే సెక్షన్ 185 మోటారు వెహికల్ యాక్టు ప్రకారం మొదటిసారి అయితే రూ.10 వేల జరిమానా లేదా ఆరు నెలల వరకు జైలుశిక్ష లేదా రెండు విధిస్తారన్నారు. తిరిగి రెండోసారి పట్టుబడితే రూ.15 వేల జరిమానా లేదా ఒక ఏడాది వరకు జైలు శిక్ష లేదా రెండు విధించే అవకాశం ఉందన్నారు. డ్రంకన్ అండ్ డ్రైవింగ్ టెస్ట్‌లో పట్టుబడిన వారిని తప్పకుండ కోర్టులో హాజరుపరిచి జరిమానా, జైలుశిక్ష విధించేలా చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా ప్రయాణం చేయాలని సూచించారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ట్రైనీ ఎస్పీ అంకితాసురానా, పక్కన కృష్ణ చైతన్య

- ట్రైనీ ఎస్పీ అంకితా సురానా

మార్కాపురం: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైనీ ఎస్పీ అంకితా సురానా హెచ్చరించారు. స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యా సంస్థల్లో జూనియర్ విద్యార్థులపై సీనియర్లు ర్యాగింగ్ చేస్తూ మానసికంగా ఇబ్బందుకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాగింగ్ చేసి భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. కళాశాలకు చదువుకోడానికి వస్తున్నామనే ఆలోచనతోనే ఉండాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆమె సూచించారు. కళాశాల సెక్రటరీ అన్నా క్రిష్ణచైతన్య మాట్లాడుతూ ర్యాగింగ్ అనే భూతాన్ని సమాజాన్నుంచి తరిమికొట్టాలని, విద్యార్థులు సోదరభావంతో ఉండాలని తెలిపారు. సీనియర్లు, జూనియర్లకు కళాశాల బోధనా పద్ధతులు, విధానాలు నేర్పాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. కృష్టారెడ్డి మాట్లాడుతూ ర్యాగింగ్ లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, విద్యార్థులపై ఎప్పటికప్పుడు సూపర్‌విజన్ ఉంటుందని, తరచుగా సమావేశాలను నిర్వహిస్తుంటామని చెప్పారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో సీఐ మా నాయక్, పెద్దారవీడు ఎస్సై పులి రాజేష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనీల్‌కుమార్, కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్మన్ రామ్మోహన్, హెచ్‌ఓడీలు డాక్టర్ జీవీ అనీల్‌కుమార్, కె.రాముడు, కిశోర్‌బాబు, బి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మిలిటరీ తుపాకీ అప్పగింత



పోలీసులకు తుపాకీ అందిస్తున్న కుటుంబ సభ్యులు

స్వర్ణ (కారంచేడు): అతనో మిలిటరీ జవాను.. రిటైర్డు అయ్యాడు. అనంతరం రెండేళ్ల తర్వాత ఓప్రమాదంలో మృతి చెందాడు. ప్రస్తుతం ఆయన వద్ద ఉన్న తుపాకీని తన భార్య, కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు అప్పగించారు. అందిన వివరాల మేరకు.. కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన సాదు రంగారావు (50) మిలిటరీలో పనిచేస్తూ రిటైర్డ్ అయ్యాడు. అప్పట్లో తను ఒక లైసెన్స్‌డ్ గన్ కొనుగోలు చేశాడు. 2021 ఆగస్టు 2వ తేదీన ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆయనకు సంబంధించిన లైసెన్స్‌డ్ తుపాకీని రంగారావు భార్య, కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి అప్పగించేందుకు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారి ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు స్వర్ణ వచ్చి తుపాకీని, 12 రౌండ్ల బుల్లెట్లను వారికి అప్పగించారు.